మహిళలకు కొండంత ఆసరా!



ఈ ఫొటోలోని మహిళ పేరు కాకాని అలేఖ్య. పెనుగంచిప్రోలు గ్రామం. దుర్గాభవాని పొదుపు సంఘం సభ్యురాలు. ప్రతి ఏడాది ఆసరా కింద ఆమెకు రూ.15,800 నగదును రాష్ట్ర ప్రభుత్వం ఆమె బ్యాంక్ ఖాతాలో జమ చేస్తోంది. ఈ నగదుతో పాటు లింకేజీ రుణాలు, తాను సొంతంగా కొంత నగదుతో గేదెల పెంపకంతో పాటు ఇంటి వద్ద కంప్యూటర్ ఎంబ్రాయిడరీ నిర్వహిస్తున్నారు. ఆసరా నగదుతో తనకు కావాల్సిన మెటీరియల్ తెచ్చుకుంటున్నారు. తాను ఉపాధి పొందటంతో పాటు నలుగురికీ ఉపాధి కల్పిస్తున్నారు.



తిరుపతమ్మ ఆలయం వద్ద గాజుల దుకాణంలో కుటుంబ సభ్యులతో వసంత

ఈ ఫొటోలోని మహిళ పేరు వసంత. ప్రతి సంవత్సరం రూ.12 వేలు ఆసరా సొమ్ముతో పాటు గ్రూపు రుణం కొంత, తన సొంత సొమ్ము కొంత వినియోగించి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద గాజుల దుకాణం నిర్వహిస్తోంది. ఆసరా పథకం తమకు ఎంతో మేలు చేసిందని ఆమె సంతోషంగా చెబుతోంది.

పెనుగంచిప్రోలు మండలంలో

ఆసరా కింద ఎంపికైన పొదుపు సంఘాలు **1167**

పొదుపు సభ్యులు **11,600**

ఒక్కో సంవత్సరం అందిన మొత్తం రూ.**10.44** కోట్లు

ఇప్పటి వరకు అందిన మొత్తం రూ.**31.32** కోట్లు

- ఆసరా నగదుతో మహిళా సాధికారత
- స్వయం ఉపాధితో పాటు మరికొంతమందికి ఉపాధి
- పొదుపు మహిళలకు ఇచ్చిన మాట నిలుపుకొన్న సీఎం జగన్
- రుణమాఫీ చేసిన జగనన్నకు రుణపడి ఉంటామంటున్న అక్కచెల్లెళ్లు

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి అండగా నిలిచారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 2019 ఏప్రిల్ 11 వరకు పొదుపు సంఘాల్లో ఉన్న సభ్యులకు నాలుగు విడతలుగా ఆసరా పథకం కింద రుణమాఫీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు విడతలుగా ఆసరా కింద రుణమాఫీ చేసి పొదుపు సంఘాల మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచారు.

11,600 మంది మహిళలకు మేలు

పెనుగంచిప్రోలు మండలంలో 1167 పొదుపు సంఘాల్లో దాదాపు 11,600 మంది సభ్యులు ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వల్ల అప్పుల పాలయిన మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట నిలుపుకొన్నారని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో మాఫీ పేరుతో దగా

గత టీడీపీ హయాంలో పొదుపు సంఘాల్లోని మహిళలను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పసుపు, కుంకుమ పేరుతో మోసం చేశారు. పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను మాఫీ చేయకుండా ఎన్నికలు దగ్గర పడటంతో ఓట్ల కోసం పసుపు, కుంకుమ పేరుతో ఒక్కో సభ్యురాలికి రూ.10 వేలు ఇచ్చి దగా చేశారు. ఈ నగదు కూడా కొందరికి మాత్రమే రావటంతో అనేక మంది అర్హులైన పొదుపు సంఘాల సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

రుణమాఫీ చేయటం సంతోషంగా ఉంది



చెప్పిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకం కింద రుణమాఫీ చేయటం చాలా సంతోషంగా ఉంది. గురుబ్రహ్మ గ్రూపు కింద రూ.5 లక్షలు రుణం తీసుకున్నాం. ఒక్కొక్కరికి మూడు విడతలుగా రూ.12,800 చొప్పున రుణమాఫీ అయింది. ఈ మొత్తంతో జీవనోపాధికి అవసరమైన మార్గాలు చేపట్టటం జరిగింది.

–బొర్రా వెంకట సుజాత, ముండ్లపాడు గ్రామం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఆసరా పథకం ద్వారా మా గ్రూపు తీసుకున్న రూ.4 లక్షల రుణం మాఫీ అయింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత రుణమాఫీ కూడా చేస్తున్నారు. మా సంఘ ఆర్థిక ఎదుగుదలకు కారణమైన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–పి.అరుణ, వెంకటాపురం గ్రామం

1167 సంఘాలకు ఏడాదికి రూ.10.44 కోట్లు



మండలంలో 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంక్ రుణం ఉన్న దాదాపు 1167 పొదుపు సంఘాల్లోని సభ్యులందరికీ ప్రతి ఏడాది రూ.10.44 కోట్లు నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతోంది. ఇప్పటికే మూడు విడతలుగా ఆసరా అందగా, నాలుగో విడత మరో ఏడాది అందుతుంది.

–రాజారావు, ఏపీఎం

క్లుప్తంగా

ఉదయభాను బక్రీద్ శుభాకాంక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకొనే బక్రీద్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం ఒక ప్రకటన ద్వారా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ద్వారా ప్రతి ఒక్క ముస్లిం కుటుంబానికి ఆ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

మండలానికి చేరిన డస్ట్‌బిన్‌లు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 19 గ్రామ సచివాలయాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన 18 వేల డస్ట్‌బిన్‌లు బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ సాంబశివరావు మాట్లాడుతూ అన్ని గ్రామ సచివాలయాలకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఇంటింటికీ తడి, పొడి చెత్త వేరు చేసేలా డస్ట్‌బిన్‌లు అందిస్తామని తెలిపారు.

బక్రీద్ నేపథ్యంలో ముస్లిం పెద్దలతో సమావేశం



నందిగామ: బక్రీదు పర్వదినం నేపథ్యంలో బుధవారం సాయంత్రం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ హనీష్ ముస్లిం పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు, పెద్దలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలియజేశారు.

ఆకట్టుకున్న మాయాబజార్ నాటకం



నందిగామటౌన్(చందర్లపాడు): మండలంలోని పున్నవల్లి గ్రామంలో ఆసరా ఫౌండేషన్ సహకారంతో సురభి డ్రామా థియేటర్, సురభి జయానంద్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మాయాబజార్ నాటక ప్రదర్శన నిర్వహించారు. నాటక ప్రదర్శనలో బళ్లారి రాఘవ కళా సమితి అధ్యక్షుడు బొబ్బెళ్ల పాటి గోపాలకృష్ణ సాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మాయాబజార్ నాటక ప్రదర్శన నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. నాటక ప్రదర్శనకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి వంశీ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కంచికచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ పీపీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన గుడిశె ప్రభుదాసు(60) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయగా ప్రయివేటు వాహనంపై చికిత్స కోసం అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత సేవలకు ఆమోదం ?

ఉచిత చెప్పుల స్టాండ్, 2 ఉచిత బస్సులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల కోసం ఉచితంగా చెప్పుల స్టాండ్, ఉచిత బస్సు సేవలకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. దుర్గగుడి పాలక మండలి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత భక్తులకు ఉచితంగా చెప్పుల స్టాండ్ సదుపాయంతో పాటు దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి రెండు దేవస్థాన బస్సులను ఉచితంగా నడపాలని చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రతిపాదనలు చేశారు. వీటికి దేవదాయ శాఖ కమిషనర్ ఈ నెల 14న ఆమోదం తెలిపినట్లు సమాచారం. గురువారం పాలక మండలి సమావేశంలో ఈ ఇవి చర్చకు రావచ్చని తెలుస్తోంది.

అమ్మ ఒడి బిడ్డల భవిష్యత్తుకు భరోసా

కంచికచర్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.13 వేల చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. అమ్మ ఒడి పథకంతో తమ పిల్లలను చదివించగలుగుతున్నామని తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేద వాళ్లను ఆదుకుంటున్న సీఎం జగన్



మా పాప సజితాబాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. నాలుగేళ్ల నుంచి అమ్మ ఒడి పథకం ద్వారా నా బ్యాంకు అకౌంట్‌లో నగదు జమ అయ్యాయి. అందుకే మా పిల్లలను చదివిస్తున్నా. మాలాంటి పేదవారిని ఆదుకుంటున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– షేక్ సాదిక, విద్యార్థి తల్లి, గండేపల్లి

మామయ్యలా ఆదుకుంటున్నాడు



నా బిడ్డ ఒకటో తరగతి చదువుతున్నాడు. బడికి పంపిస్తే నగదు వస్తాయని అనుకోలేదు. కాని నా అక్కౌంట్‌లో రూ.13వేలు అమ్మ ఒడి పథకం ద్వారా నగదు జమ అయ్యాయి. నా బిడ్డకు మామయ్యలా సీఎం జగన్ ఆదుకుంటున్నాడు. జగనన్నను ఎన్నటికీ మర్చిపోము.

– కుమ్మరి దమయంతి, విద్యార్థి తల్లి, గండేపల్లి

సీఎం జగన్‌కు థ్యాంక్స్



తమ కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. ప్రతి ఏటా అమ్మ ఒడి పథకం వస్తోంది. ఆ డబ్బులు బిడ్డను చదివించుకునేందుకు ఎంతో దోహదపడుతున్నాయి. చదువుకునే పిల్లలకు నగదు ఇచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

గరికపాటి శిరీష, విద్యార్థి తల్లి, గండేపల్లి

గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం జగన్ కృషి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వెల్లంకి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వెల్లంకి(వీరులపాడు): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి అని గత పాలకుల మాదిరిగా ప్రచారానికే పరిమితం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చేసి చూపుతున్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని, ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ హుసేన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, నాయకులు పీఏసీఎస్ చైర్మన్ తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో విజేతలకు నగదు బహుమతి



క్విజ్ పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులతో డీఈవో రేణుక

వీరులపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రేణుక అన్నారు. విజయవాడలో నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆమె నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలోని పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2023 జీఈ20 ఫైనాన్షియల్ లిటరసీపై జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీలలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సంతోషిణి, తొమ్మిదవ తరగతి విద్యార్థిని నవ్య ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. విజేతలను అభినందించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు.

సాఫ్ట్‌బాల్ ప్లేయర్ స్మైలీకి సత్కారం



స్మైలీని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెచ్ఎం కీస్తురాణి, సుపీరియర్ రెక్సిలిన్ తదితరులు

కంచికచర్ల: ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో మెలుగుతూ, చదువు పట్ల ఆసక్తితో ప్రతిభా సామర్థ్యాలను పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు సిస్టర్ క్రీస్తురాణి అన్నారు. తైవాన్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొని బెస్ట్ ప్లేయర్ బహుమతిని గెలుచుకున్న స్మైలీని బుధవారం విజయరాణి ఉన్నత పాఠశాలలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 13 నుంచి 17వ తేదీ వరకు ఆసియా ఉమెన్ అండర్ 15 సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు తైవాన్‌లో జరిగాయన్నారు. ఇండియన్ టీమ్ తరఫున తమ స్కూల్ విద్యార్థిని కొండూరు స్మైలీ పాల్గొని బెస్ట్ ప్లేయర్ బహుమతిని గెలుచుకుందని చెప్పారు. కార్యక్రమంలో విజయరాణి సుపీరియర్ సిస్టర్ రెక్సిలిన్, పీడీ జంగా అనంతయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ టీమ్‌కు ఎంపికైన క్రీడాకారులకు అభినందన



అండర్-19 కృష్ణా జిల్లా క్రికెట్ టీమ్‌కు ఎంపికైన క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: అండర్-19 కృష్ణాజిల్లా క్రికెట్ టీమ్‌కు ఎంపికైన క్రీడాకారులను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అభినందించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన వారిని అభినందించారు. ఈనెల 29 వ తేదీన గుంటూరులో జరగనున్న అండర్-19 రాష్ట్రస్థాయి వన్ డే క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్న టి.వరుణ్ సాత్విక్(కెప్టెన్), భాను వరప్రసాద్, చిన్నా, రాజేష్, ఆదర్శ్‌లను ఆయన అభినందించి వారికి క్రికెట్ బ్యాట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని క్రీడా విభాగంలో దేశ స్థాయిలో నిలబడే విధంగా వారు క్రికెట్‌లో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు కొలగాని రాము, వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్



కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): మండలంలోని కె.పొన్నవరం గ్రామంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా ఒక్కసారిగా కూలీల మధ్యలో భారీ తాచుపాము హల్‌చల్ చేసింది. దీంతో కూలీలు భయాందోళనలతో అటూ ఇటూ పరుగెత్తారు. చివరకు దానిని కొట్టి చంపటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'డూప్లికేట్' బాధితుల వివరాల సేకరణ



కంచికచర్ల: మండలంలోని పెండ్యాల గ్రామంలో డూప్లికేట్ డిజిటల్ ఎనర్జీ యాప్ ద్వారా నగదు పెట్టుబడి పెట్టి నష్టపోయిన బాధితుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఎవరెవరు ఎంత నగదు నష్టపోయారో వివరాలను నందిగామ ఏసీపీ జనార్ధన నాయుడు ఆదేశాల మేరకు సీఐ ఐవీ నాగేంద్రకుమార్ సౌజన్యంతో ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది సేకరిస్తున్నారు.

నేడు నారాయణతీర్థుల 348వ జయంతి ఉత్సవం

విజయవాడ కల్చరల్: సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంగీత విద్వాంసుడు నారాయణతీర్థుల 348 జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ మల్లాది సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నారాయణ తీర్థుల తరంగ గోష్ఠిగానం ఉంటుందని 12 గంటలు జరిగే తరంగ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, విమలాభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రోజు రోజుకు పెరిగిపోతున్న వాయు, జల కాలుష్యం వలన మానవుడు నష్టపోతున్నందున పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక సెయింట్ ఆన్స్ అమెరికన్ హాస్పిటల్ అనుబంధ సంస్థ సర్వజన స్నేహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యార్థులు, పలు మహిళా సంఘాలతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. పట్టణ సమీపంలోని కర్మాగారాల వారు మొక్కలు నాటే కార్యక్రమానికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి శుభ కార్యక్రమాల రోజున ఒక మొక్క నాటాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతను తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో అతిథులు మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, విమలాభాను ప్రారంభించారు. ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ వైఎస్ సర్కిల్, కమలా సెంటర్, బస్టాండ్ సెంటర్, మున్సిపల్ కూడలి, బలుసుపాడు సెంటర్ మీదుగా బాలుర హైస్కూల్‌కు చేరుకుంది. అనంతరం బాలుర హైస్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కమిషనర్ మల్లేశ్వరరావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, కేసీపీ సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ మధుసూదనరావు, ఎస్‌ఐ రామారావు, ఫారెస్ట్ ఆఫీసర్ సాగర్, స్నేహ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సిస్టర్లు నిర్మల, ఫెలిస్ట, సెయింట్ ఆన్స్ సుపీరియర్ మేరి ఆంటో, సిస్టర్లు జాయిస్, సుగంధి, ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపల్ అంకయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

స్పష్టం చేసిన వెల్లంకి సర్పంచ్, ఆమె కుమారుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అబ్బీ సాహెబ్, పక్కన ఎమ్మెల్సీ అరుణకుమార్

వెల్లంకి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ అభిమాన నాయకుడని, తాము ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారే ప్రసక్తే లేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని వెల్లంకి సర్పంచ్ షేక్ హుసేన్‌బీ, ఆమె కుమారుడు అబ్బీ సాహెబ్ స్పష్టం చేశారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో శాసనమండలి సభ్యుడు అరుణకుమార్‌తో కలిసి బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము పార్టీ మారుతున్నామని తమపై కొందరు ప్రచారం చేస్తున్నారని, అటువంటి అసత్య ప్రచారాలను ఖండిస్తున్నామన్నారు. తమకు రాజకీయ భవిష్యత్తును కల్పించటమే కాకుండా సర్పంచ్‌ను చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ వీడమని తెలిపారు. శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ గ్రామాభివృద్ధికి తమకు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పని చేసి పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

దుష్ప్రచారాలను నమ్మవద్దు : అరుణకుమార్

శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ మాట్లాడుతూ వెల్లంకి గ్రామ సర్పంచ్, ఆమె కుమారుడు పార్టీ మారుతున్నారని కొందరు దుష్ప్రచారాలు చేస్తున్నారని, అటువంటి వాటిని నమ్మవద్దన్నారు. వారితో పాటు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పార్టీలోనే కొనసాగుతున్నారని చెప్పారు. మోసకారి పార్టీ టీడీపీని నమ్మే స్థితిలో తమ కార్యకర్తలే కాదు, ప్రజలు కూడా లేరని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కౌలు రైతు కార్డుల పంపిణీ

జగ్గయ్యపేట: మండలంలోని పోచంపల్లి, షేర్ మహ్మద్‌పేట గ్రామాల్లో కౌలు రైతుల కార్డుల పంపిణీ బుధవారం రెవెన్యూ, వ్యవసాయాధికారులు కౌలు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా డీటీ నాగరాజు మాట్లాడుతూ కౌలు రైతులు విధిగా కార్డులు తీసుకోవాలన్నారు. ఈ నెల 30తో కార్డుల పంపిణీ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 70 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, ఎక్స్-అఫిషియో మెంబర్లు తప్పక హాజరు కావాలని కోరారు.